ప్రజాశక్తి

శనివారం 4 అక్టోబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

రైతులకు సాయమందేనా?

- కృష్ణా పరీవాహక ప్రాంతంలో వరదలు
- అరటి, కంద, పసుపు పంటలకు భారీ నష్టం
- తుది అంచనాలు రూపొందిస్తున్న యంత్రాంగం



నీట మునిగిన పసుపు పంట (ఫైల్)

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

కృష్ణానదిలో వరద ప్రవాహం తగ్గడంతో పరీవాహక ప్రాంతంలో పంట పొలాలు నీటి నుంచి బయట పడుతున్నాయి. నాలుగు రోజులు ముంపులోనే ఉన్న పంటలు తిరిగి కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. భారీగా నష్టం వాటిల్లిందని ఉద్యాన, వ్యవసాయ పంటలు సాగు చేసిన రైతులు వాపోతున్నారు. క్షేత్రస్తాయిలో పరిశీలించి వ్యవసాయ, ఉద్యాన వనశాఖల అధికారులు పంట నష్టం తుది అంచనాలను రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే భారీగా నష్టపోయిన రైతులు తాము కోలుకునేందుకు ప్రభుత్వ సాయం అందించాలని కోరుతున్నారు.

సెప్టెంబర్ 29వ తేదీ నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు నాలుగు రోజులు పాటు కృష్ణానదిలో 6 లక్షల 60 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు ప్రవహించింది. పరీవాహక ప్రాంతంలోని 12 గ్రామాల్లో 537 మంది రైతులకు సంబంధించి 460.81 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 14 గ్రామాల్లో 1634 మంది రైతులకు సంబంధించి 1087.42 హెక్టార్లలో ఉద్యాన పంటలు ముంపుకు గురయ్యాయి. జిల్లా యంత్రాంగం ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందించారు. వరద తగ్గడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది నివేదికను సిద్ధం చేస్తున్నారు. తాజాగా 33 శాతంపైగా నష్టం వాటిల్లిన పంటలకు మాత్రమే పరిగణలోకి తీసుకుని నష్టం అంచనాలను రూపొందిస్తున్నారు. దీని ఆధారంగానే ప్రభుత్వం రైతులకు పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందుతాయి. లక్షల్లో నష్టపోయిన వారికి కనీస పరిహారం (మిగతా 2లో)





దసరా కార్నివాల్‌ను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

ముగిసిన దసరా ఉత్సవాలు

- విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొన్న సిఎం చంద్రబాబు
- దసరా కార్నివాల్‌కు గిన్నిస్ బుక్‌లో స్థానం



ఉత్సవాల ముగింపు సందర్భంగా యాగశాలలో పూర్ణాహుతి

ప్రజాశక్తి-విజయవాడ, సిటీ, అర్బన్

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజు అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో యాత్రికులకు దర్శనమిచ్చారు. గురువారం యాగశాలలో నిర్వహించిన పూర్ణాహుతితో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల 11 రోజుల్లో 16 లక్షల మందికి పైగా యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. కృష్ణానదికి వరద నేపథ్యంలో తెప్పోత్సవం రద్దయిన సందర్భంగా ఉత్సవమూర్తులను కనకదుర్గ నగర్ నుండి ఊరేగింపుగా తీసుకొచ్చి దుర్గా ఘాటు వద్ద హంస వాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పో గ్రౌండ్స్‌ను సిఎం చంద్రబాబు సందర్శించారు. అలాగే మహాత్మాగాంధీ రోడ్డులో దసరా కార్నివాల్‌ను సిఎం జెండా ఊపి ప్రారంభించారు. సాంస్కృతిక కవాతు, కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

... వార్తలు మెయిన్, 5వ పేజీలో

బుడమేరు ముంపు నివారణకు నిధులు కేటాయించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు



బహిరంగ లేఖను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ: బుడమేరు ముంపు శాశ్వత నివారణకు రూ. పది వేల కోట్లు నిధులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు డిమాండ్ చేశారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని ఎంబి స్టేడియంలో 'వాహన మిత్ర పథకం' ప్రారంభోత్సవానికి శనివారం వస్తున్న సిఎంకు బుడమేరు వరద బాధితుల తరుపున సిపిఎం విజయవాడ నగర కమిటీ బహిరంగ లేఖ విడుదల చేసింది. ఆ లేఖలోని వివరాలను శ్రీశ్రీ భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో బాబురావు వెల్లడించారు. బుడమేరు శాశ్వత చర్యలపై సిఎం చంద్రబాబుపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు విడుదల చేయించాల్సిన బాధ్యత నగరంలోని అధికార టిడిపి ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. బుడమేరు వరద వల్ల అధికారిక లెక్కలకు మించి రెట్టింపు (మిగతా 2లో)

నేడు 'వాహన మిత్ర' ప్రారంభం

- హాజరుకానున్న సిఎం చంద్రబాబు
- సింగ్‌నగర్‌లో ఏర్పాట్లు పరిశీలించిన సిపి

ప్రజాశక్తి-విజయవాడ: ఆటో, క్యాబ్ యజమానులకు సంవత్సరానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేసే 'వాహన మిత్ర' పథకాన్ని సిఎం చంద్రబాబునాయుడు శనివారం ప్రారంభించనున్నారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగే కార్యక్రమంలో సిఎం పాల్గొంటున్న సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, ఇతర శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తుపై అధికారులకు, సిబ్బందికి తగు సూచనల చేశారు. భద్రతాపరంగా ఎటువంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని

ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిపి



ఆదేశాలిచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాల రద్దీ ఏర్పడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి సరిత, కె.తిరుమలేశ్వరరెడ్డి, ఇంటిలిజెన్స్ ఎస్‌పి ఆఫీజ్, డిసిపి ప్రసాద్, ఏడిసిపి కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యారేజీకి తగ్గిన వరద

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

కృష్ణానదికి వరద ప్రవాహం తగ్గింది. నిన్నటిదాకా ఉప్పొంగి ప్రవహించిన కృష్ణానది ఎగువ జలాశయాల నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద 2,16,083 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతుంది. 1,98,825 క్యూసెక్కుల వరద నీటిని బ్యారేజీ గేట్లను ఎత్తి అధికారులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. తూర్పు కాలువకు 9,337 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 7,921 క్యూసెక్కుల జలాలను విడుదల చేశారు. వరద కొనసాగుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ సూచించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

సిఎంకు సిఐటియు బహిరంగ లేఖ

ప్రజాశక్తి-విజయవాడ: ఆటో, క్యాబ్ యజమానులతో పాటు ప్రతిఒక్క ఆటో డ్రైవర్‌కు రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నేతలు కోరారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని మాకినేని బవసపున్నయ్య స్టేడియంలో ఈ నెల 4వ తేదీన వాహన మిత్ర పథకం ప్రారంభానికి వస్తున్న సిఎం చంద్రబాబుకు ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌టిఆర్ జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ నేతలు బహిరంగ లేఖ విడుదల చేశారు. విజయవాడ శ్రీశ్రీ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సి.హెచ్ శ్రీనివాస్, ఆటో వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు మాట్లాడుతూ వేలాది రూపాయలు జరిమానాలు విధించే జీవో నెంబర్ 21, పెండింగ్‌లో ఉన్న చలానాలు రద్దు చేయాలన్నారు. ఆటోల కొనుగోలుకు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా ఐదు శాతం వడ్డీతో నేరుగా రూ.4 లక్షల వరకు రుణాలను ప్రభుత్వం ఇప్పించాలన్నారు. ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోయిన ప్రతి ఆటో డ్రైవర్‌ను ఆదుకోవాలన్నారు. గత పది రోజుల క్రితం విజయవాడ వాంబే కాలనీ ఆటో డ్రైవర్ పసుపులేటి సుబ్బారావు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. క్యాబ్,



ఆటో యజమానులతో పాటు ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించాలన్నారు. ఆటో కార్మికుల సమస్యలపై సిఎంకు వినతిపత్రాన్ని అందించేందుకు కలెక్టర్ అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.రూబేనుకుమార్, ఎం.హనుమంతరావు, ఎస్‌డి కరిముల్లా, ఎస్‌కె దుర్గావళి, ఎన్.రాఘవ, ఎవి రెడ్డి, జి.శ్రీనివాసరావు, సరగడ కృష్ణ, యు.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి-విజయవాడ: విజయదశమి రోజున యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. దసరా శరన్నవరాత్రుల ఉత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించినందుకు విఎంసి సిబ్బంది కృషిని ఆయన అభినందించారు. 300 మంది ఇంజనీరింగ్ అధికారులు, వెహికల్ డిపో సిబ్బంది సమన్వయంతో తాగునీటికి ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకున్నామన్నారు. 19 ప్రదేశాలలో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేకంగా 1490 మంది కార్మికులతో మూడు షిఫ్ట్‌లలో పని చేయించామన్నారు. మూలా నక్షత్రం రోజున అదనంగా 300 మంది సిబ్బందిని కేటాయించామన్నారు.

మొదటిపేజీ తరువాయి

రైతులకు సాయమందేనా?

అందేలా క్షేత్రస్థాయి సర్వేలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతన్నకు భారీ నష్టం

కృష్ణాజిల్లా పురిటిగడ్డకు చెందిన కౌలు రైతు మురాల రాజు ఎకరం విస్తీర్ణంలో సాగు చేసిన పసుపు పంట వరద ముంపుకు గురైంది. రూ.40 వేలు భూయజమానికి ముందస్తు కౌలు చెల్లించారు. విత్తనానికి రూ.28,500, ఎరువులకు రూ.15 వేలు, విత్తనం వేయడం, కలుపు తీయడానికి రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.98,500 ఖర్చు చేశారు. ఈ గ్రామంలో అరటి పంట సాగు చేసిన కౌలు రైతు కేసాని శ్రీనివాసరావు మూడు ఎకరాల్లో అరటి పంట సాగుకు రూ.2 లక్షల 20 వేలు ఖర్చు చేశారు. కోనేరు సుబ్రహ్మణ్యేశ్వరరావు కంద సాగుకు రూ. 2 లక్షలు ఖర్చు చేశారు. వరదలు తగ్గడంతో పంటలు పైకి తేలి కనిపిస్తున్నా నాలుగు రోజులు ముంపులో ఉండటంతో పెట్టిన పెట్టుబడిలో చేతికి చిల్లిగవ్వ రాదని రైతులు వాపోతున్నారు. ఇది ఈ ముగ్గురు రైతులు పరిస్తితి మాత్రమే కాదు.. నదీ తీర ప్రాంతంలో పంటలు ముంపుకు గురైన రైతులందరిదీ ఇదే పరిస్థితి. వ్యవసాయ ఖర్చులు పెరగడంతో నదీ పరివాహక ప్రాంతంలో ఉద్యాన పంటలకు రైతులు భారీగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఎకరాకు 70 వేల నుంచి లక్ష రూపాయలు వ్యయం అవుతోంది. పంటలను వరదలు ముంచెత్తినప్పుడు రైతులు, కౌలు రైతులు అప్పుల పాలవుతున్నారు.

బుడమేరు ముంపు నివారణకు నిధులు కేటాయించాలి

నష్టం జరిగిందన్నారు. ఏడాది గడిచినా నేటికీ శాశ్వత చర్యలు లేవన్నారు. తూతూ మంత్రంగా గండిపడిన ఒక చోట రిటైనింగ్ వాల్ కట్టి సరిపెట్టుకున్నారన్నారు. వరద సాయం అందరికీ అందలేదన్నారు. బుడమేరు శాశ్వత నివారణకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని, బాధితులు అందరికీ సాయం అందించాలని, ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా తగిన సమాచారం అందించాలని, వరద బాధితుల్లో నమ్మకం కలిగించాలని డిమాండ్ చేశారు. విజయవాడ నగరాభివృద్ధికి, నగరపాలక సంస్థకు నిధులివ్వకుండా ఎండగడుతున్నారని బాబూరావు విమర్శించారు. తక్షణమే ఈ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీపావళి నాటికి నాలుగు లక్షల గృహాలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, విజయవాడ, పరిసర ప్రాంతాల్లో జక్కంపూడిలో ఆగిపోయిన టిడ్కో ఇళ్లు వేల సంఖ్యలో గత ఎనిమిదేళ్ల నుంచి ఖాళీగా ఉన్నాయన్నారు. విజయవాడలో అనేక విలువైన ఖాళీస్థలాలు కబ్జాకు గురౌతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా దీపావళి నాటికి అర్హులందరికీ గృహాలు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు సిటీ కమిటీల కార్యదర్శులు బోయి సత్యబాబు, భూపతి రమణారావు, పి కృష్ణ పాల్గొన్నారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి : చంద్రబాబు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో ఏర్పాటు చేసిన ఎక్స్పోను గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సందర్శించారు. ఈ క్రమంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్లో అగ్రికల్చర్ పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన కృష్ణా మిల్క్ యూనియన్ స్టాల్‌ను పరిశీలించారు. చంద్రబాబు ఆలోచన మేరకు కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా మునగచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన చంద్రన్న సామూహిక గోకులం నిర్వహణ, అనుబంధంగా సాగు చేస్తున్న పశుగ్రాస క్షేత్రాల గురించి



చైర్మన్ చలసాని ఆంజనేయులు ముఖ్యమంత్రికి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రూ.150 కి అందిస్తున్న సెక్స్ సార్టెడ్ సెమెన్ (లింగ నిర్ధారిత వీర్యం) ను కృష్ణా మిల్క్ యూనియన్ రూ.100 సబ్సిడీతో ఉమ్మడి కృష్ణాజిల్లా, ఉభయ గోదావరి జిల్లాల్లో పాడి రైతులకు కేవలం రూ.50కి అందిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. పాడి రైతుల ఆర్థికాభివద్ధికి కృషి చేయాలని, పశువుల హాస్టల్స్ ఏర్పాటు, నిర్వహణకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని సిఎం భరోసా ఇచ్చిన్నట్లు మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్, శ్రీరామ్ తాతయ్య, తంగిరాల సౌమ్య, నెట్టెం రఘురామ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిశ పాల్గొన్నారు.

ఓటు చోరీపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-పామర్రు : దేశంలో బిజెపి ప్రభుత్వం ఓటర్ల జాబితాలో పాల్పడుతున్న అవకతవకలపై ఉద్యమం చేపడతామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొళ్ళు కృష్ణ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్చార్జి మొవ్వా మోహనరావుతో కలిసి పామర్రులో ఓట్ల చోరీపై నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పౌరుల ఓట్లను కొల్లగొట్టి అధికారంలోకి వచిందని దానికి వ్యతిరేకంగా ఎఐసిసి అధ్యక్షులు రాహుల్ గాంధీ చేపడుతున్న ఓట్ చోరీ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టామన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టేటప్పుడు ఖచ్చితమైన ఆధారాలతో నిర్వహించాలన్నారు. పెనమలూరు నియోజక వర్గ ఇన్చార్జి దనేకుల మురళి, కన్వీనర్లు పాల్గొన్నారు.

పలుచోట్ల గ్రామసభలు

ప్రజాశక్తి-మోపిదేవి : చిరస్థాయిగా నిలబడే విధంగా మంచి పనులకు గ్రామ పంచాయతీ సహకరించాలని పిఎసిఎస్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు అన్నారు. మోపిదేవి మండల పరిధిలోని మెరకనపల్లి గ్రామ పంచా యతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ యర్రంశెట్టి ధన రాజ్యలక్ష్మీ అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కొల్లిపర రామ కోటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన గ్రామ సభలో చైర్మన్ సుబ్బారావు గ్రామంలోని పలు సమస్యలను సభ దష్టికి తీసుకువచ్చారు. కుక్కల బెడద గ్రామంలో అధికంగా ఉందని సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి గ్రామపంచాయతీ పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సొసైటీ కార్యదర్శి యన్నా వెంకట శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు మేరకనపల్లి సుబ్బారావు, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆకుల పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** భూవివాదాలు శాశ్వత పరిష్కారానికి రీసర్వే ఉపయోగపడుతుందని పమిడిముక్కల తహసిల్దార్ నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గురజాడ గ్రామంలో గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ శివరామకష్ణ ,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందివాడ :** మండలం లోని శ్రీనివాసపురం, జనార్ధనపురం గ్రామాల్లో మూడో విడత రి సర్వే పనులు ప్రారంభించినట్లు తాసిల్దార్ గురుమూర్తిరెడ్డి తెలిపారు. రీ సర్వే డి.టి రహేలమ్మ, మండల సర్వేయర్ ఫణి కుమార్, విలేజ్ సర్వేయర్ మహేంద్ర శ్యాం, విఆర్వోలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పిహెచ్‌సి వైద్యుల సమ్మె

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పిహెచ్సి వైద్యులను పదేపదే మోసం చేస్తోందని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పి. దీప్తి ఆరోపించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఇన్‌సర్వీస్ పీజీ కోటా తగ్గింపు నిర్ణయం, ఇతర సమస్యల పరిష్కారానికి చేస్తున్న సమ్మె శుక్రవారం కొనసాగించారు. సమ్మెలో భాగంగా జిల్లాలోని పిహెచ్సీలలో వైద్యసేవలను బహిష్కరించి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్లకార్డుల ప్రదర్శన, కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. తమ న్యాయపరమైన కోరికలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డా. దీప్తి మాట్లాడుతూ గతేడాది కోటా తగ్గించగా, ఆందోళనల తర్వాత పునరుద్ధరించినప్పటికీ ఈ ఏడాది మళ్లీ కోత విధించడంతో గ్రామీణ ప్రాంతాల వైద్యుల ఉన్నత చదువుల అవకాశాలు దెబ్బతింటు న్నాయన్నారు. సమస్యలను



పరిష్కరించకపోతే ఉద్య మాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో డాక్టర్ ప్రణయ్ సాగర్, డాక్టర్ నీరిక్షణ (జిల్లా వైద్య ఆరోగ్యాధికారి కార్యాలయం), డాక్టర్. తేజస్విని (చిన్నవోగిరాల), డాక్టర్. సౌందర్య (పిహెచ్సి బంటుమిల్లి), డాక్టర్. దివ్య, డాక్టర్. సందీప్ (పిహెచ్సి వెంట్రప్రగడ), డాక్టర్. సాయి సందీప్ (పిహెచ్సి కతివెన్ను), డాక్టర్. సాయి కిరణ్ (పిహెచ్సి రుద్రపాక), డాక్టర్. లాస్య హరిత (చిన్నాపురం), డాక్టర్. రియాజ్ (వేకనూరు) పాల్గొన్నారు.

అతిసారతో ఎవరూ మృతిచెందలేదు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఎనిమిదో వార్డులో ముగ్గురు వ్యక్తులు డయేరియాతో మరణించారనే వార్త శుక్రవారం దుమారం లేపింది. గత నెల 27,28 తేదీలలో అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో 8 మంది డయేరియాతో చికిత్స పొందుతున్నట్లు పత్రికలలో వార్తలు రావడంతో వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల సైతం తరలివచ్చి డయేరియా సోకిన ప్రాంతాలను పరిశీలించడంతోపాటు వేకనూరు పిహెచ్ సి వైద్యులు కూడా తరలివచ్చి ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. కాగా తాజాగా ముగ్గురు వ్యక్తులు డయేరియాతో మరణించారు అంటూ పుకార్లు రావడంతో ఒక్కసారిగా అవనిగడ్డ ప్రజలు ఉలిక్కిపడ్డారు. దీనిపై డిఎంఅండ్‌హెచ్‌ఓ వివరణ ఇచ్చారు. 8 వార్డులో వివిధ కారణాలతో ముగ్గురు వ్యకులు మరణించగా ఆ మరణాలను డయేరియా కేసులుగా ప్రచారం చేయడం కాదన్నారు. ముగ్గురు వ్యక్తుల లో ఒకరు విజయవాడ జనరల్ వైద్యశాలలో మరణించగా మరో ఇరువురు వ్యక్తులు అవనిగడ్డ సిహెచ్సి సెంటర్లో మరణించినట్లు తెలిపారు. ఇందులో బందెల జ్ఞాన సుందర్రావు కిడ్నీ వ్యాధితో మృతిచెందినట్లు తెలిపారు. మరొకరు మునిపల్లి సరోజిని గత కొంతకాలంగా మంచం లోనే చికిత్స పొందుతుందని, ఆమెను ఈనెల 1వ తేదీన అవనిగడ్డ సిహెచ్ సి సెంటర్లో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు తెలిపారు. మరొకరు కైతేపల్లి కోటయ్య ఈనెల 2వ తేదీన ఆమనగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేరగా ఆయన కూడా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు తెలిపారు .

నేడు, రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులోని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాజిలిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శని, ఆదివారాలు ఉచిత వైద్య శిబిరాల్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో ఎముకలు, కీళ్ళు, నడుము, దంత, గుండె, హెూమియో, బీపీ, షుగర్, థైరాయిడ్, సాధారణ, మానసిక, నేత్ర వైద్య పరీక్షల వంటి వైద్యాన్ని ప్రముఖ కార్పోరేట్, మల్టీ స్పెషాలటీ హాస్పటల్స్ లోని వైద్య నిపుణులచే అందించనున్నారని డాక్టర్ వెంకట్రావు శుక్రవారం తెలిపారు. రోగులకు ఉచిత మందులను కూడా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఈడుపుగల్లు లో కారు దగ్ధం

ప్రజాశక్తి-కంకిపాడు : ఆగిన కారు నుంచి మంటలు వ్యాపించి, పూర్తిగా దగ్ధమైన సంఘటన కంకిపాడు మండలం ఈడుపుగల్లులో శుక్రవారం సాయంత్రం జరిగింది. హైదరాబాద్ నుంచి ఈడుపుగల్లుకు కారులో వస్తుండగా గంగూరు వద్ద కారు ఆగిపోవడంతో పక్కనే ఉన్న షెడ్డు వద్ద కారును మెకానిక్ పరిశీలిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అక్కడి వారు అప్రమత్తమై ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి, మంటలను అదుపుచేశారు. కారు పూర్తిగా దగ్ధమైంది. కారు కొద్దీ నిమిషాల్లో గమ్యస్థానం చేరాల్సి ఉంది.

యుటిఎఫ్ మాజీ నాయకులు పెద బసవయ్య మృతి



ప్రజాశక్తి-ఉంగుటూరు : యుటిఎఫ్ మాజీ నాయకులు దివి పెద బసవయ్య 93 శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు వయోభారంతో గన్నవరం అయోధ్య అపార్ట్మెంట్లో మృతిచెందారు. పెద బసవయ్య కుటుంబం నాటి సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు కొరటాల సత్యనారాయణతో సాన్నిహిత్యం నుండి నేటి వరకు సిపిఎంలోనే కొనసాగుతున్నారు. పెద బసవయ్య 35 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ యుటిఎఫ్ నిర్మాణానికి ఆయన ఎంతో కృషి చేశారు. అదేవిదంగా విద్యార్థులకు విద్యను బోధించ డంతో పాటు ఆయన పనిచేసిన ప్రతి చోట ప్రజలతో మమేకమై వారి శ్రేయస్సు కోసం వారిని చైతన్యపరచడంలో కీలక భూమిక పోషించారు. బసవయ్య అంత్యక్రియలు గన్నవరంలో శనివారం 11 గంటలకు నిర్వహిస్తున్నామని ఆయన కుమారుడు మోహన్ కుమార్ తెలిపారు. బసవయ్య అంత్యక్రియలలో సిపిఎంపొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వి శ్రీనివాస రావు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొంటారు. బసవయ్య భౌతికకాయాన్ని శనివారం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరావు, మండల పార్టీ కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, చంద్రిక అపార్ట్మెంట్ వ్యవస్థాపకులు గుర్రం నాని, కొయ్యగూరపాడు పిఎసిఎస్ మాజీ అద్యక్షులు పిడికిటి రత్నప్రసాద్, ఎల్ఐసి కాట్రగడ్డ శ్రీనివాసరావు స్థానిక పార్టీ నాయకులు మిరప నాగేశ్వరావు, బాబావలీ సందర్శించి నివాళులర్పించారు.

సిపిఎం సీనియర్ నాయకులు వెంకటరత్నం మృతి

గన్నవరం : గన్నవరం మండలం సావరగూడెంకు చెందిన సిపిఎం సీనియర్ నాయకులు పాలడుగు వెంకటరత్నం (73) అనారోగ్య కారణాలతో గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. గ్రామంలో జరిగిన కూలి రేట్లు ఉద్యమం, సంక్రాంతి సందర్భంగా యువకులకు క్రీడా, సాంస్కృతిక పోటీల నిర్వహణలో ఆయన కీలకపాత్ర వహించారు. గ్రామస్తుల ఇళ్ల స్థలాల అవసరాల నిమిత్తం తన భూమిని భూసేకరణలో ప్రభుత్వానికి ఇచ్చారు. ఆయన భౌతికకాయాన్ని శుక్రవారం సిపిఎం నాయకులు వై నరసింహారావు, కళ్ళం వెంకటేశ్వరరావు, ఎం ఆంజనేయులు, మరియ దాసు, కళ్ళం రాంబాబు, జడ్పిటిసి సభ్యురాలు ఎలిజిబెత్ రాణి, సావరగూడెం సర్పంచ్ అట్లా నాగేశ్వరరావు, నాయకులు అన్నవరపు నాగేశ్వరావు తదితరులు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వందలాదిమంది కార్యకర్తలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు జరిగాయి.



ఆల్-రేంజ్ వెహికిల్ డీలర్‌షిప్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ ఎలక్ట్రిక్ వెహికల్ మొబిలిటీ సొల్యూషన్స్ కంపెనీ, విజయవాడలో ఆర్‌ఆర్ తన సరికొత్త ఆల్-రేంజ్ వెహికల్ డీలర్షిప్‌ను శుక్రవారం ప్రారంభించింది. నగరంలోనిగుణదల, ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీ సర్వీస్ రోడ్డులో షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ బిజినెస్ హెడ్ రోహిత్ శ్రీ వాస్తవ మాట్లాడుతూ గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి వంటి ప్రధాన నగరాలకు సజావు కనెక్టివిటీని అందిస్తుందని తెలిపారు. 3 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ డీలర్షిప్, ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కులు, చిన్న వాణిజ్య వాహనాలతో సహా అతిపెద్ద శ్రేణి ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలను ప్రదర్శిస్తుందన్నారు. స్థానిక వ్యాపారులు, నివాసితులకు పర్యావరణ అనుకూలమైన, నమ్మకమైన, ఆర్థికంగా అందుబాటులో ఉన్న వాహనాలను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు..

సిపిఎం సీనియర్ నాయకులు మధు మృతి పలువురు నివాళి



ప్రజాశక్తి - తిరువూరు : సిపిఎం తిరువూరు పట్టణ సీనియర్ నాయకులు నల్లమోలు మధుసూదనరావు(78) మృతి చెందారు ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్ర వారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయనకు భార్య కుమార్తె, కొడుకు ఉన్నారు. కొడుకు శ్రీనివాసరావు న్యాయవాదిగా పని చేస్తున్నారు. తిరువూరు సీతామహాలక్ష్మి కాలనీలోని ఆయన నివాసంలో మధుసూదనరావు భౌతికకాయాన్ని విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు బిఆర్. తులసిరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్, సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, గుళ్లపల్లి వెంకటరత్నం, ఐద్వా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు సానికొమ్ము కుమారి తదితరులు పార్టీ పతాకాన్ని కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు తాళ్లూరి రామారావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చింతల వెంకటరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు పసుపులేటి వెంకయ్య, సిపిఎం నాయకులు బి.వెంకటేశ్వర రావు, ఎస్.వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు కాలసాని నాగేశ్వరరావు, తదితరులు మతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం అంతిమయాత్రలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, బంధువులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో మేము సైతం..



విజయవాడ : దసరానవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీ దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రుల్లో చివరి రోజు శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దర్శించేదుకు విచ్చేసిన భక్తులకు, క్యూ లైన్‌లో ఉన్నటువంటి వారికి, బస్‌స్టాండ్, రాజీవ్ గాంధీ పార్క్, కుమ్మరిపాలెం పిఎంటిడబ్ల్యుయు ఆటో స్టాండ్ పరిసర ప్రాంతాల్లో పరమేశ్వర చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు, కందుల పరమేశ్వరావు, దివనాపు తిరుపతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మంచినీటి బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు, పూర్ణిమ, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సనాతన ధర్మానికి తమవంతు సేవ చేసే క్రమంలో నగరంలోని మరిన్ని ట్రస్ట్‌లు కలిసి రావాలని కోరారు... ఈ కార్యక్రమంలో పరమేశ్వర మోటర్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ సభ్యులు మెట్టపల్లి అయ్యప్ప, మెట్టపల్లి తులసి, వసుధ దుర్గారావు, డేగల రామారావు పాల్గొన్నారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి

- సిఎంకు బోయి సత్యబాబు లేఖ



ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం నుంచి విజయవాడ నగరానికి రావాల్సిన రూ.642 కోట్లు నిధులను తక్షణమే మంజూరు చేసి, నిలిచిపోయిన అనేక ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు ముందుకు సాగే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విజయవాడ నగరపాలక సంస్థకు రావాల్సిన నిధులపై నేడు విజయవాడకు విచ్చేస్తున్న సిఎం చంద్రబాబుకు సత్యబాబు బహిరంగ లేఖ విడుదల చేశారు. ఆ వివరాలను శుక్రవారం విలేకరులకు విఎంసిలోని తన చాంబర్‌లో సత్యబాబు వివరించారు. నిధుల కొరతతో ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదని, దీంతో విజయవాడ నగరాభివృద్ధి స్తంభించిపోందన్నారు. విజయవాడ నగరం రాజధాని ప్రాంతంగా కొనియాడుతారని, కానీ చిన్నపాటి వర్షాలకి నగరం ముఖ్యమైన అనేక ప్రాంతాలు చెరువులుగా రోడ్లు మారుతున్నాయని అన్నారు. రూ.461 కోట్ల అంచనా విలువ కలిగిన ఎంతో ముఖ్యమైన స్టాంమ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణ పనులు నిధులు లేక పనులన్నీ ఏళ్ల తరబడి నిలిచిపోయాయని అన్నారు. రూ. 289 కోట్లు నేటికీ రాష్ట్ర ప్రభుత్వం వద్దనే ఉన్నాయన్నారు. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన అవసరాలకు వాడుకుని నగరపాలక సంస్థ స్టాంమ్ వాటర్ డ్రై నిర్మాణాలకు విడుదల చేయడం లేదన్నారు. బుడమేరు కాల్వ, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ సక్రమంగా లేక నగరంలో వర్షపు నీరు సక్రమంగా పారుదల జరగడం లేదన్నారు. నగర అభివద్ధికి కొండ ప్రాంతాల అభివద్ధికి గతంలో ఏపీ గ్రాండ్స్ నిధులు రూ.150 కోట్ల గాను 13 కోట్లు మాత్రమే విజయవాడ నగరపాలక సంస్థలో అభివద్ధి పనులకు విడుదలయ్యాయని, మిగిలిన రూ.137 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయవలసి ఉందన్నారు. నగరానికి రావలసిన నిధులను రాబట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వద్దకు నగరపాలక సంస్థలోని అఖిలపక్ష ఫ్లోర్ లీడర్లను అధికార టిడిపి ప్రజాప్రతినిధులు తీసుకెళ్లాలని సిపిఎం పక్షంగా కోరుతున్నామని అన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్లు ఎంపిక

ప్రజాశక్తి-గూడూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కష్ణా, ఎన్ టి ఆర్ జిల్లాల స్కూల్ గేమ్స్ కార్యదర్శులు శుక్రవారం తెలిపారు. అండర్ 14,17 బాల, బాలికలు విభాగాలలో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. 4వ తేదీన పోరంకి జోయల్ స్కేటింగ్ స్పోర్ట్స్ అకాడమీలో రోల్ బాల్ ఎంపికలు మధ్యాహ్నం 2 గంటలకు, విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో క్యారమ్ ఎంపికలు ఉదయం 9 ప్రారంభమవుతాయన్నారు. 5న తైక్వాండో ఉదయం 10 గంటలకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం విజయవాడలో ,6 న బాస్కెట్ బాల్ సెలెక్షన్స్ ఉదయం 9:30 గంటలకు నూజివీడు బిఐఎస్ సీబీఎస్ఈ స్కూల్‌లో, అదే రోజు నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సైక్లింగ్ సెలెక్షన్స్ ఉదయం 9 గంటలకు గంటలకు, 7 న వెయిట్ లిఫ్టింగ్ మరియు పవర్ లిఫ్టింగ్ సెలెక్షన్స్ ఉదయం 9 గంటల నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిల్లకల్లులో జరుగుతాయన్నారు.



పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి-తిరువూరు : తిరువూరు మండలం గానుగపాడు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు అవసరమైన ప్రింటర్‌ను ప్రవాస భారతీయుడు మందడపు నరేంద్ర (ఇంగ్లాండ్) వితరణ చేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం. రాంప్రదీప్ చొరవతో వితరణ చేసిన ప్రింటర్‌ను శుక్రవారం రామ్‌ప్రదీప్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విక్టోరియాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.హరీష్, వై.ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

హేమలత లవణం దంపతులు చిరస్మరణీయులు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సామాజిక రుగ్మతలను పారద్రోలి, మానవీయకోణంలో సాంఘిక మార్పునకు, మానవహక్కుల పరిరక్షణకు, నిరాదరణకు గురైన సాంఘిక వర్గాల అభ్యున్నతికి పాటుపడిన హేమలతా లవణం దంపతులు చరిత్రలో చిరస్మరణీయులని కర్నాటక రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కుంభజడల మన్మథరావు పేర్కొన్నారు. ఆధునిక సంఘ సంస్కరణోద్యమాలకు ఒక నూతన సాంఘిక వ్యాకరణాన్ని ప్రవేశపెట్టారనిప్రశంసించారు. వారి స్ఫూర్తి కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. గ్రంథాలను ఆవిష్కరించిన తరువాత స్టువార్టుపురంవాసి, హేమలతాలవణం దంపతుల కార్యక్రమ ప్రధాన సహచరుడు గరిక ప్రభాకరరావుకు అందజేశారు. సభలో గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రజాశక్తి బుక్ హౌస్ సంపాదకులు ఎం.వి.ఎస్. శర్మ ప్రసంగిస్తూ సాంఘిక సంస్కర్తలు గోరా, సరస్వతి, లవణం, హేమలత చేపట్టి నిర్వహించిన ఉద్యమాలు హేతుబద్ధంగా సాగి, కులమతాలకు అతీతంగా చరిత్రలో ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన నాస్తిక కేంద్రం అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం మాట్లాడుతూ సంఘ సంస్కరణోద్యమాలప హేమలతా లవణం ప్రచురించిన గ్రంథాలను చదవటం వలన నిజమైన సంఘస్ఫూర్తి, చైతన్యదీప్తి సంఘంలో నిరాటంకంగా విరాజిల్లుతాయని అభిప్రాయపడ్డారు. ఈ సభలో సంస్కార్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు హరి సుబ్రమణ్యం, డాక్టర్ కొంపల్లి సుందర్, నాస్తిక కేంద్రం బాధ్యులు జి.నియంత, ఆంధ్రప్రదేశ్ హరిజన సేవకసంఘ్ అధ్యక్షులు చెన్నుపాటి వజీర్, గాంధీ స్మారకనిధి కార్యవర్గ సభ్యులు జి.రశ్మి, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు బొల్లినేని కీర్తి, ప్రముఖ వైద్యులు ఓలాస్ గోరా, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి

- సిఎంకు బుడమేరు ముంపు బాధితుల ఐక్యవేదిక లేఖ

ప్రజాశక్తి-విజయవాడ : బుడమేరు వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని బుడమేరు ముంపు బాధితుల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కోరింది. మఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాహనమిత్ర పథకం కార్యక్రమానికి సింగ్ నగర్‌లోని ఎంబి స్టేడియంనకు శనివారం విచ్చేస్తున్న సందర్భంగా బుడమేరు ముంపు బాధితుల ఐక్యవేదిక కన్వీనర్ యంవి ఆంజనేయులు శుక్రవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. ఆ వివరాలను ఆయన శుక్రవారం మీడియాకు వివరించారు. గత సంవత్సరం వచ్చిన బుడమేరు వరద సింగ్ నగర్ పరిసర ప్రాంతాలను ముంచెత్తిందని అన్నారు. దీని వలన అపారమైన నష్టం సంభవించిందని తెలిపారు. వరద సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సింగ్‌నగర్ ప్రాంతలో తిరిగి జరిగిన నష్టాన్ని స్వయంగా చూసి వరద నివారణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. సంవత్సరం దాటినప్పటికీ వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఇప్పుడు ముఖ్యమంత్రి మరలా సింగ్‌నగర్‌కు విచ్చేస్తున్నారని,బుడమేరు శాశ్వత నివారణ చర్యలు చేపట్టడానికి చర్యలు ప్రకటిస్తారనిబుడమేరు ముంపు బాధితుల ఐక్యవేదిక ఆశిస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులు కూడా సిఎం చంద్రబాబుపై వత్తిడి తీసుకొచ్చి నిధులు మంజూరయ్యేలా, ముంపు నివారణా చర్యలు తీసుకునేందుకు చొరవ చూపాలని కోరారు.

ప్రణాళిక బద్ధంగా ధాన్యం సేకరణ : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రణాళిక బద్ధంగా ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్‌తో కలిసి ధాన్యం సేకరణ పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో ఎదురైన అనుభవాలను దష్టిలో ఉంచుకొని ఈసారి ఖరీఫ్ కాలంలో చాలా జాగ్రత్తలు పాటించి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించాలని సూచించారు. ఇందుకోసం ముందుగానే ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏలు) చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రైతులందరికీ ధాన్యం సేకరణ పై వారు పెద్ద ఎత్తున అవగాహన కలిగించాలన్నారు.గ్రామాల్లో వరి కోత స్థితిగతులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ఉన్నతాధికారులకు స్పష్టమైన సమాచారాన్ని చేరవేయాలన్నారు.జిల్లా కేంద్రంలో ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేసి దాన్యం సేకరణ సజావుగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. వరి ధాన్యం సేకరణ కేంద్రమైన రైతు సేవ కేంద్రాన్ని కాదని నేరుగా మిల్లర్ల దగ్గరికి పోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరాం ప్రసాద్, డీఎస్ఓ మోహన్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, డిసిఓ చంద్రశేఖర్, జిల్లా రవాణా అధికారి ఎన్ శ్రీనివాసు, తూనికలు కొలతల శాఖ సహాయ నియంత్రణ అధికారి భాను ప్రసాదు పాల్గొన్నారు.











ఇంద్రకీలాద్రిపై ముగిసిన దసరా ఉత్సవాలు



ప్రజాశక్తి-విజయవాడ సిటీ, విజయవాడ అర్బన్ : విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజు అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో యాత్రికులకు దర్శనమిచ్చారు. విజయదశమి కావడంతో యాత్రికులతో పాటు భవానీల రద్దీ పెరిగి దర్శనానికి ఆరు గంటలకు పైగా సమయం పట్టింది. 60 కంపార్ట్మెంట్లను ఏర్పాటు చేసి రద్దీకి అనుగుణంగా యాత్రికులను క్యూలైన్లలో పంపించారు. 11 రోజుల్లో 16 లక్షల మందికి పైగా యాత్రికులు అమ్మవారిని అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్తరాంధ్రతో పాటు ఉమ్మడి కృష్ణాజిల్లా, ఉభయ గోదావరి, జిల్లాల నుంచి భవానీలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ ఏడాది 11 రోజుల పాటు ఇంద్రకీలాద్రిపై అత్యంత వైభవంగా నిర్వహించారు. చివరి రోజు విజయదశమి పర్వదినాన గురువారం యాగశాలలో నిర్వహించిన పూర్ణాహుతితో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఈవో శీనా నాయక్, దుర్గ గుడి ఛైర్మన్ బొర్రా రామకష్ణ వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నగరోత్సవంలో భాగంగా ఉత్సవమూర్తులను కనకదుర్గ నగర్ నుండి ఊరేగింపుగా తీసుకొచ్చి దుర్గా ఘాటు వద్ద హంస వాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి - పెదపారుపూడి(గుడివాడ) : మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో దసరా నవరాత్రులను పురస్కరించుకొని శుక్రవారం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారిచే సుమారు రెండు వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, పిఎసిఎస్ సొసైటీ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య, నాయకులు పొనుగోటి సత్యనారాయణ, జాజుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** కూచిపూడి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహెూత్సవ వేడుకలలో భాగంగా 12వ రోజైన శుక్రవారం అమ్మవారు శ్రీ సంతోషి మాతా దేవిగా భక్తులకు దర్శనమిచ్చి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా ఆమె సన్నిధిలో గౌరీ పంచాక్షరి ఉపదేశం పొందిన సువాసినిలు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వీరితో జోశ్యులకార్తికేయ శర్మ (గుడివాడ)లక్షనామ కుంకుమార్చనలను చేయించగా కుంకుమను జోశ్యులకమల కుమారి జ్ఞాపకార్థం ఆమె భర్త నాగ జగన్మోహనరావుతో పాటు కుటుంబ సభ్యులు సమర్పించారు. అమ్మవారికి అయ్యవారికి నూతన వస్త్రాలను కురవివెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్-సునంద (నూజివీడు), కురవిగోపికష్ణ-వెంకటనాగమహిజ (హైదరాబాద్) దంపతులు సమర్పించారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామం సోమిశెట్టి బజారులోని అయోధ్య రామాల యంలో దసరా వేడుకల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బారి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించగా చల్లపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం, ఘంటసాల ఆర్ఐ కె.శ్రీనివాస్లు ప్రారం భించారు. సుమారు 600 మంది భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

విజయవాడ ఉత్సవ్‌తో సంస్కృతి పునరుజ్జీవం : సిఎం







మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు



ప్రజాశక్తి - విజయవాడసిటీ, విజయవాడ, అర్బన్ : విజయవాడ ఉత్సవ్, అమరావతికి మణిహారంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దసరా సంబరాల్లో భాగంగా గురువారం సాయంత్రం విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పో గ్రౌండ్స్‌ను సీఎం సందర్శించారు. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత రోబో వంటశాలను పరిశీలించిన సీఎం, ఏఐ సహకారంతో వండిన చిల్లీ పన్నీర్ వంటకంను రుచి చూసి బాగుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించిన ఆయన, ఆర్గానిక్ వ్యవసాయం పై మరింత దృష్టి సారించాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. విజయవాడ గొల్లపూడి ఎక్స్‌పో గ్రౌండ్స్‌లో దసరా సంబరాల్లో భాగంగా జరిగిన విజయవాడ ఉత్సవ్ 11 రోజులపాటు అద్భుతంగా నిర్వహించిన ఉత్సవాన్ని విజయవంతం చేసిన ఎంపీ కేశినేని శివనాథ్ నిర్వాహక బందాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రజలు ఆనందంగా వినియోగిస్తున్నారని, విజయవాడ దుర్గమ్మ దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారని తెలిపారు. దుర్గమ్మ ఆశీస్సులు, కష్ణమ్మ కరుణతో ఈ ప్రాంతం అభివద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కనుమరుగవుతున్న కళలను కాపాడుకోవడం అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. 11 రోజులపాటు జరిగిన ఉత్సవంలో 280కిపైగా ఈవెంట్లు నిర్వహించగా, దాదాపు 2.50 లక్షల మంది వీక్షించారని తెలిపారు. హెలీ రైడింగ్, సాహస క్రీడలు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయని, రోబోటిక్ కిచెన్ ద్వారా విజయవాడ పారిశ్రామికవేత్తల ప్రతిభను ప్రదర్శించారని ఆయన అభినందించారు. మహాత్మా గాంధీ రోడ్డుపై నిర్వహించిన సాంస్కతిక కవాతు, డప్పు కళాకారుల గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. గరగలు, కొమ్ముకోయ, తప్పెటగుళ్ళు, కర్రసాము, బుట్టబొమ్మలు, భేతాళసెట్టు, నాసిక్ డోల్ వంటి ప్రజా కళారూపాలు భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబించాయని ఆయన అన్నారు. పర్యాటక రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, దేవాలయాలు 5 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థను ఆకర్షించే శక్తి కలిగివున్నాయని వివరించారు.విజయవాడ ఉత్సవ్ విజయవంతం కావడం ప్రజల ఐక్యతకు, సంస్కతిపై మమకారానికి, అభివద్ధిపై విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

దసరా కార్నివాల్‌కు గిన్నిస్‌బుక్‌లో స్థానం

- బందర్ రోడ్డుపై కళల గంగోత్రి
- 40 కళాబృందాలు, 3 వేల మంది కళాకారులతో మెగా కార్నివాల్ వాక్





ప్రజాశక్తి - విజయవాడసిటీ, విజయవాడ, అర్బన్ : విజయవాడ బందర్ రోడ్ గురువారం రాత్రి కళల సముద్రంలా మారింది. దసరా కార్నివాల్ వాక్ అంగరంగ వైభవంగా ప్రారంభమై నగర గౌరవాన్ని మరోసారి ప్రపంచ పటంలో నిలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, ఈ మహెూత్సవాన్ని భవిష్యత్తులో కొనసాగించేలా నాంది పలికారు.

గిన్నిస్ బుక్ రికార్డ్స్ లో స్థానం : ఈసారి నిర్వహించిన దసరా కార్నివాల్ కేవలం పండుగ సంబరమే కాదు.. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాలన్న లక్ష్యంతో ముందుకు సాగింది. 40కి పైగా కళాబందాలు, 3 వేల మందికి పైగా కళాకారులతో నిర్వహిం చిన ఈ కార్నివాల్ వాక్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో స్థానం సంపాదించుకుంది. తద్వారా విజయవాడకు ప్రపంచ వేదికపై విశిష్టమైన గుర్తింపు తెచ్చిపెట్టింది.

కళాకారుల ప్రతిభ : భారతీయ సాంప్రదాయం నుంచి ఆధునిక నత్యరూపాలు వరకు, ప్రత్యేక వేషధారణలతో కూడిన కళాకారుల ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. "ఆంధ్రసాంస్కతిక వైభవం ఇదే" అని గర్వపడేలా వేదికను తీర్చిదిద్దారు.



బందర్ రోడ్డు రంగుల మయం : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకు సాగిన ప్రదర్శనతో బందర్ రోడ్ మొత్తం పండుగ వాతావరణంలో మెరిసిపోయింది. విద్యుత్ దీపాల అలంకరణలు, రంగురంగుల వేషధారణలు నగరాన్ని ప్రపంచ స్థాయి ఉత్సవ వేదికగా నిలిపాయి.

విజయవాడ ఉత్సవ్ నగర మరింత గౌరవం : విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా నిర్వహించిన దసరా కార్నివాల్ నగరాన్ని జాతీయస్థాయిలోనే కాక ప్రపంచ వేదికపై నిలబెట్టింది. పర్యాటక రంగానికి, స్థానిక కళాకారులకు మరింత ఊపునిచ్చింది. మొత్తానికి, ఈ దసరా కార్నివాల్ వాక్ భక్తి, వైభవం, సాంస్కతిక ప్రతిభ మాత్రమే కాకుండా, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకొని విజయవాడకు గర్వకారణమైంది. ఇది విజయవాడ చరిత్రలో ప్రపంచ స్థాయి సాంస్కతిక మైలురాయిగా నిలిచింది.

ఎన్ఆర్ఐ వల్లభనేని చొరవతో గురుకులంలో సౌకర్యాలు కల్పన



ప్రజాశక్తి- విస్సన్నపేట: విస్సన్నపేట మండలం కలగర లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎన్నారై వల్లభనేని గిరిబాబు చొరవతో విస్సన్నపేట గిరిజన గురుకుల బాలుర వసతి గృహం విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యాయి. గిరిబాబు తన సొంత నిధులు లక్ష రూపాయలు ఖర్చు చేసి వసతి గహంలో కిటికీలకు దోమతెరలు, బాత్రూములు, విద్యార్థుల గదులకు డోర్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు దగ్గరుండి పనులను పరిశీలించారు. ప్రిన్సిపల్ రత్నాకర్‌కు సూచనలు చేశారు.

జిఎస్‌టి తగ్గింపుపై రైతుల ర్యాలీ

ప్రజాశక్తి-వీరులపాడు : వ్యవసాయ యంత్రాలపై జిఎస్‌టి 12 శాతం నుండి ఐదు శాతం వరకు తగ్గించినందుకు ఎన్టీఆర్ జిల్లా వీరులపాడులో రైతులు డాక్టర్లతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై జిఎస్‌టి భారాన్ని తగ్గించినందుకు అభినందనలు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ఒట్టి కొండ చంద్రమోహన్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



రియల్ ఎస్టేట్ ఏజెంట్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గ రియల్ ఎస్టేట్ ఏజెంట్ల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వీర్ల రాంబాబు, ఉపాధ్యక్షుడిగా చిలకల్లు గ్రామానికి చెందిన సంపతి రామయ్య, జనరల్ సెక్రటరీగా గడ్డం రాంబాబు యాదవ్‌ను నియోజవర్గ రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో శుక్రవారం ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ల సమావేశంలో అన్ని గ్రామాల నుండి సుమారు 150 మంది ఏజెంట్లు పాల్గొని కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏజెంట్లు మాట్లాడుతూ భవిష్యత్తులో ఏజెంట్లకు రావాల్సిన సంక్షేమ ఫలాలు, హక్కులు, సమస్యలపై పరిష్కారం దిశగా అసోసియేషన్ పని చేయాలని కోరారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: చోరీ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసిన సంఘటన ఇంబ్రహీంపట్నంలో చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం సిఐ చంద్రశేఖర్ పోలీస్ స్టేషన్లో ఈ మేరకు వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన బంగారు వ్యాపారి వికాస్ కుమార్ జైన్.. సికింద్రాబాద్ నుంచి తణుకు బస్సులో వెళుతున్న సమయంలో వెస్ట్ ఇబ్రహీంపట్నం వద్ద నగల బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో బాధితుడు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన ఇబ్రహీంపట్నం పోలీసులు తుమ్మలపాలెం లేబై దగ్గర నలుగురు వ్యక్తులను గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఇబ్రహీంపట్నం సిఐ ఆదేశాలతో క్రైమ్ ఎస్ఐ సేనాపతి శ్రీనివాస్ టీం అతి తక్కువ కాలంలో చోరీ కేసులు ఛేదించి, పోలీసులు నిందితుల నుండి చోరీ అయిన బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ ఎస్సై సేనాపతి, ఇబ్రహీంపట్నం ఎస్సై విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎ.కొండూరు అభివృద్ధికి కృషి : ఎంపిపి



ప్రజాశక్తి-ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని ఎంపిపి కాలసాని నాగలక్ష్మి కోరారు. శుక్రవారం ఎ. కొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో జరిగిన మండల సర్వసభ్య సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలోని గ్రామాల అభివృద్ధిపై అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు దృష్టి సారించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. జెడ్‌పిటిసి భూక్యా గనియా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొత్త పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతుందన్నారు. ఎంపీటీసీ కోట పుల్లారావు మాట్లాడుతూ మండలంలోని 51 అంగన్వాడీ కేంద్రాల్లో కొందరు కార్యకర్తలు, విధులకు హాజరు కాకుండా డుమ్మా కొడుతున్నారని, కేంద్రాల్లో ఆయాలే చిన్నారులను సంరక్షిస్తున్నారని, విధులకు డుమ్మా కొట్టే కార్యకర్తలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ శాఖాధికారి షేక్ టిప్పు సుల్తాన్ మాట్లాడుతూ మండలంలో రైతులకు యూరియా కొరత లేదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సిహెచ్ లక్ష్మీ, ఎంపీడీవో బొజ్జగాని శ్రీనివాసరావు, వైస్‌ఎంపిపి సిద్ధం పద్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, అనధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత : ధ్యానచంద్ర



ప్రజాశక్తి-విజయవాడ : స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యతని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం పాత గవర్నమెంట్ ప్రెస్, ముత్యాలంపాడులో 'స్వచ్ఛోత్సవ- స్వచ్ఛత హిసేవ' ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత నెల 17తో మొదలైన స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్విరామంగా ఈ నెల 2వ తేదీ వరకు ప్రతిరోజు స్వచ్ఛతపై విజయవాడ నగరంలో పలు రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అందులో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు సింగిల్ యూస్ ప్లాస్టిక్ బాన్, రెడ్యూస్ రీ యూస్, రీసైకిల్ అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారని, మొక్కలను పెంచడం, వ్యర్థాల నుండి వస్తువులు తయారీ, శ్రమదానం చేయటం, పర్యావరణహితమైన వస్తువులనే వాడటం, సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను బ్యాన్ చేయడం, రీ- యూస్ రీసైకిల్ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేయడం వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. భూగర్భ డ్రైనేజీ కార్మికులకు పిపిఈ కిట్లు అందజేసి, అక్కడున్న గోడపై విద్యార్థినీ విద్యార్థులతో కలిసి పెయింటింగ్ వేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాసన్, పాల్గొన్నారు.

చౌటపల్లిలో అన్నదానం

ప్రజాశక్తి-వీరులపాడు : మండలంలో చౌటుపల్లి గ్రామంలో దసరా నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు

ఎంపిటిసి స్వరాజ్యం మృతి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం -1 ఎంపిటిసి జానలపాటి స్వరాజ్యం శుక్రవారం మృతి చెందారు. గత కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందారు. ఆమె భర్త వేణుగోపాల్ రెడ్డి మండల టిడిపిలో కీలక నేతగా ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు నివాళులర్పించారు.

గాంధీ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో గురువారం గాంధీ విగ్రహన్ని ఆవిష్కరించారు. కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గంలో యువత నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొఠారు సత్యనారాయణ ప్రసాద్, కృష్ణ ఫార్మా చైర్మన్ యానాల గోపిచంద్, తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో లయన్స్ యజ్ఞం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామలో శుక్రవారం ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఇంజనీర్ చిగురుపాటి వరప్రసాద్ స్ఫూర్తితో లయన్స్ సేవా యజ్ఞం నిర్వహించారు. జిల్లా గవర్నర్ లయన్ ఆంజనేయులు వంద రోజులపాటు 107 లయన్స్ క్లబ్బుల సందర్శన కార్యక్రమం నిర్వహించారు. పేద, మధ్య తరగతి వాళ్లకు కుట్టు మిషన్లు, వీల్ చైర్లు, వైద్య సేవలు, మొక్కలు నాటడం, 365 రోజులు అన్నదాన కార్యక్రమం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు, నందిగామ నియోజకవర్గ లయన్స్ క్లబ్ అధ్యక్షులు, నందిగామ లైన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని సేవలు ఆదర్శనీయం

విజయవాడ సిటీ : గాంధీ జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు నేతలు, అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. 156వ గాంధీ జయంతి వేడుకలు గురువారం విజయవాడ నగరంలోని గాంధీ హిల్‌పై జరిగాయి. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, గాంధీ హిల్ ఫౌండేషన్ ఛైర్మన్, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ గాంధీ పీసీ కాజా, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, యలమంచిలి సుజనా చౌదరి, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, గాంధీ హిల్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొని మహాత్మునికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని ప్రముఖ స్మారక స్థలాల్లో గాంధీ కొండ ఒకటని.. ఈ ప్రాంత పునర్వైభవానికి కృషిచేస్తున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. సమష్టి కృషితో గాంధీ కొండ చారిత్రక ఔన్నత్యానికి పునర్వైభవం వచ్చిందని, 50 రోజుల్లోనే ఆధునికీకరణ పనులతో కొండ కొత్త శోభను సంతరించుకుందని.. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ, సమష్టి కృషితో దశల వారీగా జరిగే కొండ అభివద్ధిలో భాగస్వాములమవుతామని తెలిపారు. **రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండలంలో భారత స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మ గాంధీ జయంతి వేడుకలు సందర్భంగా టిడిపి, వైసిపి ల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **వీరులపాడు** : ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం చౌటపల్లి గ్రామంలో గాంధీ జయంతి సందర్భంగా ఎస్సై అనిల్ కుమార్ గ్రామస్తులతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గురజాల అజయ్ కుమార్, చౌటపల్లి సహకార సంఘం అధ్యక్షులు దొడ్డపునేని రంగారావు, గ్రామస్తులు పాల్గొన్నారు **వత్సవాయి :** పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి పాల్గొని గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ చింతల నాగేశ్వరావు, పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.. **జగ్గయ్యపేట:** దేశానికి స్వాతంత్ర్యం రావడానికి గాంధీజీ నిస్వార్ధంగా సేవలందించారని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని సామినేని ఉదయభాను స్వగృహంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ఉదయభాను పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ ప్రాంగణంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, శ్రీరాం చిన్నబాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నూకల కుమార్ రాజా, కమిషనర్ తులసి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



వత్సవాయిలో గాంధీకి నివాళులర్పిస్తున్న నేతలు



విజయవాడ గాంధీ హిల్ వద్ద మాట్లాడుతున్న ఎంపి

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన : కొల్లాటి



మాట్లాడుతున్న కొల్లాటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మత్స్యకారుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని రాష్ట్ర మత్స్యకారుల సంఘం కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం బుట్టాయిపేట జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో మత్స్యకార్మిక సంఘం కష్ణా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లాటి మాట్లాడుతూ రాష్ట్రంలో పొల్యూషన్ పెరిగిపోవడం వల్ల చేపల ఉత్పత్తి తగ్గిపోతుందని దానివల్ల మత్స్యకారులకి తిత్రవమైన నష్టం కలుగుతుందన్నారు. కాకినాడ, పిఠాపురం, ఉప్పాడ ప్రాంతాల్లో మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారని, అనకాపల్లిలో బల్క్ డ్రగ్ ఏర్పాటు చేయొద్దని వ్యతిరేకంగా పోరాడుతున్నారని, బాపట్ల జిల్లా వాడరేవు ప్రాంతంలో సీ మౌత్ ఆక్రమించిన బుర్లా వెంకటరావుకు అనుకూలంగా స్థానిక కలెక్టర్, రెవిన్యూ అధికారులు మద్దతుగా నిలబట్టం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మత్స్యకారులు ఎల్ ఆకారంలో సి మౌత్ ను పునర్దించాలని వేలాది మంది మత్స్యకారులు రోడ్ల మీదకు వచ్చి పోరాటాల్లో పాల్గొంటున్నారన్నారు. తీర ప్రాంతంలో మత్స్యకారులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఈ అన్యాయాన్ని ఎదుర్కోవటానికి మత్స్యకారులు అందరు సంఘటిం తంగా ఏర్పడి పోరాడాలని విజ్ఞప్తి చేశారు. పోతాబత్తిన రత్నారావు, వాకా రామచంద్రరావు, బస్వని నీలాజాలం, బొడ్డు నాగరాజు, తిరుమని నాగరాజు కొప్పాడి వరప్రసాద్ పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు పనులు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని స్వతంత్రపురం బీసీ హాస్టల్ వెనకాల ఎస్టీ కాలనీకి వెళ్ళు రహదారిపై వర్షపు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బూత్ ఇంచార్జ్ వీరంకి వెంకటేశ్వరరావు కోడూరు మండల టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు దష్టికి సమస్యను తీసుకు రాగా తెలుగుదేశం పార్టీ నాయకులు బూత్ ఇంచార్జిలు బొడ్డు వెంకన్న, బండే శ్రీనివాసరావు తమ సొంత నిధులను వెచ్చించి రోడ్డును మేరక పనులు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. టౌన్ అధ్యక్షులు పూతబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్టీల్ ఇండస్ట్రీ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

పద్మశ్రీ స్టీల్ ఇండస్ట్రీస్ ప్రారంభం

ప్రజాశక్తి-పమిడిముక్కల : పామర్రు నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పామర్రు ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా అన్నారు. గురువారం మండలంలోని కపిలేశ్వరపురం వద్ద పద్మశ్రీ స్టీల్ ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పద్మ స్టీల్ ఇండస్ట్రీస్ అధినేత కోగంటి వేణుగోపాలరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నాదెండ్ల సుబ్రమణ్యం, పమిడిముక్కల కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు మైనేని వెంకటనరేంద్ర, జక్కా శ్రీనివాసరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం, కొల్లిపర బాబి పాల్గొన్నారు.

స్వచ్ఛ రథం వాహనాలు ప్రారంభం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా స్వచ్ఛ రథం వాహనాలను ప్రారంభించామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం మంత్రి నగరంలోని కోనేరు సెంటర్లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి స్వచ్ఛ రథం వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జే అరుణ, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా అధికారి జడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోయ నాగమణి పాల్గొన్నారు

'పోరుబాట' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై ప్రతి ఒక్కరూ నడుం బిగించి ఫ్యాప్టో ఆధ్వర్యంలో 7వ తేదీన నిర్వహించే పోరుబాటలో పాల్గొనాలని ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం తోట్లవల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఫ్యాప్టో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 7వ తేదీన విజయవాడ లో ఫ్యాప్టో ఆధ్యర్యం లో జరిగే ధర్నా లో ఉపాధ్యా యులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి. ఇమ్మానియేలు, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎమ్. విజయశ్రీ, మహిళా కార్యదర్శి పి. అనూష, గౌరవ అధ్యక్షులు పి. పి అహ్మద్ బాబు, బి టి ఏ నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు తక్షణ అనుమతులు : కలెక్టర్

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అందుకు సంబంధించిన అనుమతులను సింగిల్ విండో పద్ధతిలో తక్షణమే మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది. సమావేశంలో అజెండా అంశాలు, పెండింగ్ దరఖాస్తుల పురోగతి, సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికవాడలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, సింగిల్ విండో పద్ధతిపై పరిశ్రమల ఏర్పాటుకు తక్షణ అనుమతులు, రాయితీలు కల్పించాలన్నారు. పరిశ్రమల ఏర్పాట్లలో మౌలిక వసతులకు సంబంధించి ఆయా డిపార్ట్మెంట్ల వద్దకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సముద్ర నాచు పెంపకానికి సంబంధించిన ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం నాగాయలంక వంటి తీర ప్రాంతంలో స్థలం కేటాయింపు చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం ఆర్డీవోకు సూచించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, ఎల్ డి ఎం రవీంద్రారెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ గోపాలకష్ణ, అగ్నిమాపక శాఖ అధికారి ఏసురత్నం, జిల్లా పంచాయతీ, విద్యుత్ త్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్ల శ్రమదానం

ప్రజాశక్తి ఉయ్యూరు : ఉయ్యూరులోని విశ్వశాంతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నేషనల్ కేడెట్ కోర్ (ఎన్‌సిసి) ఆధ్వర్యంలో స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా ఎన్‌సిసి క్యాడెట్లు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి మచిలీపట్నం 16 (ఎ) బెటాలియన్ అడ్మిస్ట్రేషన్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ కన్నన్ మాట్లాడుతూ దేశరక్షణకు కావాల్సిన యువతరాన్ని, దేశ భద్రతకు అవసరమైన సైన్యాన్ని, భావి నాయకత్వాన్ని దేశానికి అందించటంలో ఎన్‌సిసి పలు రకాలు సేవలు అందిస్తోందన్నారు. విశ్వశాంతి విద్యాసంస్థల ప్రిన్సిపల్ కె.పద్మజావాణి, ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ జయదేవ్ మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో నిబిడీకతమైన సజనాత్మక శక్తులను వెలికితీసి



వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించటంతోపాటు దేశకోసం, సమాజంకోసం పాటుపడాల్సిన ఆవశ్యకతను గుర్తుచేయటంలోనూ, వారిలో ఆ విధమైన స్ఫూర్తిని నింపటంలోనూ ఎన్‌సిసి ఇదోధికంగా కృషి చేస్తోం దన్నా రు. కెప్టెన్ వేమూరి ఎలిజబెత్‌రాణి శ్రీనివాస, అక్షరా లయ ప్రిన్సిపాల్, సిబ్బంది, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

ముగిసిన దసరా మహోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రులు మహోత్సవాలు వైభవోపేతంగా ముగిశాయి. శ్రీ అమ్మవారికి సహస్రనామార్చన, విజయప్రాప్తికి శ్రీ లలితా, రుద్ర హవనములు జరిగాయి. దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, మాజీ సర్పంచి కొడాలి రామరాజు, దేవస్థాన సభ్యులు తూము రాజ్యలక్ష్మీ, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, ఎక్స్‌అఫీషియో మెంబర్ రుద్రపాక శరశ్చంద్ర, శివ సంతోష్ శర్మ కుంకుమ పూజ, హెూమాల్లో పాల్గొన్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా పెడన ఎమ్మెల్యే కాగిత కష్ణప్రసాద్, గుడివాడ ఆర్డీఓ జి.సుబ్రహ్మణ్యేశ్వ రరావు దంపతులు దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈఓ ఆకుల కొండల రావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు దుశ్శాలువాలతో సన్మానించి అమ్మవారి చిత్రపటాలతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు

కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో దసరా నవరాత్రుల్ని పురస్కరించుకుని ప్రదర్శించిన నాటక ప్రదర్శనలు భక్తుల్ని అమితంగా ఆకట్టుకున్నాయి. మచిలీపట్నం సాంస్కతిక విభాగం వారిచే శ్రీ కష్ణ రాయభారం (పడకసీను)ప్రదర్శన, శ్రీ సత్యహరిశ్చంద్ర (కాటిసీను) ప్రదర్శనలు అలరించాయి. జై శ్రీ విజయ నాటక మండలి వారిచే దేవనర్తకి నాటక ప్రదర్శన, అభినయ నాట్య అకాడమి కూచిపూడి వారిచే కూచిపూడి నత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

వెంటేశ్వరుని సన్నిధిలో దసరా ఉత్సవాలు...

మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో దసరా నవరాత్రులను కనులపండువగా నిర్వహించారు. వెంకటేశ్వరునికి వేద మంత్రోచ్ఛరణ నడుమ వేద పండితులు విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారిని గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధన చేపట్టారు. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి భక్తిప్రపత్తులతో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. **ప్రజాశక్తి-చల్లపల్లి.** దేవి శవరన్న రాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. చల్లపల్లిలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు ఉత్సవం సంబరంగా సాగింది. చల్లపల్లి పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు, ఉత్సవం నిర్వహించగా భక్తులు అమ్మవారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజమండ్రి కి చెందిన నిడదవోలు ఆనందరావు కళాకారుల బందం వేషధా రణలు, నత్య విలాసాలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం ఆలయంలో భక్తులకు అన్న సమారాధన జరిగింది. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొల్లిపర మధు, అన్నవరపు పాండురంగారావు, ఉడత్ బాబు, జూపూడి సాయి పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు మండలం కొండలమ్మ దేవస్థానంలో...



బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుడివాడ : బాలల్లో ఉన్న మేథో శక్తిని వెలికి తీసేందుకు బాలో త్సవం ఎంతగానో ఉపయో గపడుతుందని మండల విద్యాశాఖ అధికారి - 2 బి.బాలాజీ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఇఓ కార్యాలయంలో గుడివాడ బాలోత్సవం బ్రోచరును ఆవిష్కరించారు. బాలోత్సవం అధ్యక్షులు సనకా సుబ్బరావు ఆధ్వర్యంలో ఈ నెల 25,26 తేదిలలో స్థానిక రాజేంద్రనగర్‌లోని విశ్వభారతి ఇంగ్లీషు మీడియంలో నిర్వహించనున్న (పిల్లల పండుగ) గుడివాడ బాలోత్సవం కార్యక్రమం వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఇఓ బాలాజీ మాట్లాడుతూ ఈ పోటిలలో చిత్రలేఖనం, వ్యాసరచన, సంస్కృతిక తదితర అంశాలపై పోటిలు నిర్వహించి, బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, ఆర్‌సిపి రెడ్డి, ఎంఈవో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన వరద

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమలో నాలుగు రోజులపాటు కృష్ణానది పరివాహక ప్రాంతంలోని నదీ గర్భంలో ఉన్న గ్రామాల ప్రజలు బిక్కుబి క్కుమంటూ బతికారు. అయితే గురువారం నుండి వరద తీవ్రత తగ్గడంతో పయా గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇప్పటికే ఉధతంగా ప్రవహించిన వరద లంక గ్రామాల్లోని పంటలను ముంచెత్తింది. దీనితో ఉద్యానవన పంటలు సాగు చేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరద తీవ్రత తగ్గినప్పటికీ జరిగిన నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసి తమరు ఆదుకుంటే తప్ప అప్పుల బారి నుండి బయటపడలేమంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు వరద తగ్గడంతో అధికా రులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే పులిగడ్డ పల్లెపాలెం రేగులంక బాధితుల కోసం పులిగడ్డలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని, పాత ఎడ్లలంక గ్రామస్తుల కోసం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాసా కేంద్రాన్ని వైద్య శిబిరాన్ని ఎత్తివేశారు.

ప్రాచీన వైద్యాన్ని ప్రోత్సహించాలి



సాగిరాజును అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడి వాడ : ప్రాచీన వైద్యాన్ని ప్రోత్సహిం చాల్సిన అవసరం ఎంతైన ఉందని మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు అన్నారు. గురువారం స్థానిక పుల్ల లపాడు వంతెన వద్ద వడ్లూరు అనువంశిక ఎముకల వైద్యశాలను లంకదాసరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనువంశిక ఎముకల వైద్యశాల వైద్యులు సాగిరాజు ఉదయభాస్కరరాజు ప్రాచీన వైద్య ఉనికిని కోల్పోకుండా కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. విరిగిన ఎముకలకు ఆపరేషన్లు వచ్చిన తరుణంలో కూడా ప్రాచీనతతో కూడిన కట్లు వైద్యంతో ఘన విజయాలతో ముందుకు సాగుతున్న సాగిరాజు ఉదయ భాస్కరరాజు అభినందనీయుడని అన్నారు. వైద్యులు గోర్జి సత్యనారాయణ, స్టేడియం కమిటీ నాయకులు వల్లభనేని లక్ష్మీకష్ణ వరప్రసాద్, దొప్పలపూడి రవికుమార్, ఆర్ఎంపి సంఘ నాయకులు నండూరి ఉమాశంకర్, కోలా వెంకటేశ్వరరావు, గుదే నాగచంద్ర శేఖర్, మేడూరి రమేష్‌బాబు, పంగా ఎర్రన్నాయుడు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో దాతల ఆర్థిక సహకారం రూ.25లక్షలు అంచనాతో జిల్లాపరిషత్ హైస్కూలుకు రెండు అంతస్తుల అదనపు తరగతి భవన సముదాయ నిర్మాణ పనులు చేపట్టారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ విచ్చేసి శంకుస్థాపన చేశారు. అలాగే పోతురాజు గుడి నుంచి చెరువు వరకూ నూతన డ్రైనేజీ నిర్మాణానికి రూ.20 లక్షలు జడ్పీ నిధులతో గ్రామ పంచాయతీ వద్ద భూమిపూజ చేశారు. సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణి, ఎంపీపీ రావి దుర్గావాణి, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేతనాల కోసం అంబేద్కర్ స్మృతివనం కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న స్మృతి వనం కార్మికులు

ప్రజాశక్తి-విజయవాడ :డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మృతి వనం కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు కె దుర్గారావు హెచ్చరించారు. 9 నెల పెండింగ్ వేతనాలు మంజూరు చేయని ప్రభుత్వం, సదరు కాంట్రాక్టర్ వైఖరిని నిరశిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు స్మృతి వనం ప్రధాన గేటు వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంబేద్కర్ స్మృతి వనం కాంట్రాక్ట్ కార్మికులు పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలను నెలలు తరబడి పెండింగ్‌లో ఉండటంవల్ల వారి కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, కాంట్రాక్టర్, వి.ఎం.సి అధికారులు జోక్యం చేసుకొని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వేతనాలు చెల్లించని పక్షంలో రానున్న రోజుల్లో అంబేద్కర్ స్మృతి వనం మొత్తం బంద్ చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిఐటియు సెంట్రల్ సిటీ కార్యదర్శి యం.బాబురావు మాట్లాడుతూ ప్రభుత్వం అంబేద్కర్ స్మృతి వనాన్ని అభివద్ధి చేసి అక్కడ పనిచేస్తున్న కార్మికులకు జీవనోపాధి కల్పించాలని కోరారు. కార్మికులకు ప్రతి నెల జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు సెంట్రల్ నాయకులు యం.సోమేశ్వరరావు, అంబేద్కర్ స్మృతి వనం కాంట్రాక్ట్ కార్మికులు పి.సునీత, పి.విజయ్ కుమారి, పి.మేరీ, ఎం.సుజాత, యం.దీపిక, కె.అనూష, పి. సత్యవతి, కె.ధనలక్ష్మి, సి.హెచ్ మల్లిక, హరిత, ఎల్.తేరేజమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

6న మిత్ర హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : గత 15 సంవత్సరాలుగా సెరిబ్రల్ పాల్సీతో బాధపడే చిన్నారులకు ఈ నెల 6న ఉచిత వైద్యం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ చిన్నపిల్లల ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె దుర్గా నాగరాజు తెలిపారు. వరల్డ్ సెరిబ్రల్ పాల్సీడే సందర్భంగా శుక్రవారం సూర్యారావుపేట నరసింహా నాయుడు వీధిలోని మిత్ర హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 6న నిర్వహించే వైద్య శిబిరంలో సెరిబ్రల్ పాల్సీతో నడవలేనివారికి, నడకలో వత్యాసం ఉన్న చిన్నారులకు, కాలు, చేయి వంకర కలిగిన చిన్నపిల్లలకు, పుట్టుకతో అంగవైకల్యం ఉన్న చిన్నారులకు ఉచిత వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రిజిస్ట్రేషన్ పొందిన రోగులకు ఉచిత వైద్యం లభిస్తుందని తెలిపారు. ప్రముఖ యురాలాజిస్ట్ డాక్టర్ సతీష్ మక్రివాడ మాట్లాడుతు మిత్ర హాస్పిటల్‌లో ఆధునిక వైద్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్స్ కోసం 90889 39495, 91103 66244 నంబర్లను సంప్రదించగలరు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీజియోథెరపిస్ట్ డాక్టర్ వర్షిణి, పాల్గొన్నారు.

పెద్దవరంలో 'నాన్ ఫెర్రస్ మెటల్ ఇండస్ట్రీ'కి శంకుస్థాపన



ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం పెద్దవరం గ్రామంలో శుక్రవారం "నాన్ ఫెర్రస్ మెటల్ ఇండస్ట్రీ"కి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాన్ ఫెర్రస్ మెటల్ ఇండస్ట్రీ వలన స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుకూల వాతావరణాన్ని కల్పిస్తోందని, పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రిస్ బయోటెక్ కంపెనీ ఎండి రవి చంద్, కూటమి నాయకులు సీతయ్య, వాసిరెడ్డి ప్రసాద్, పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న పలువురు ప్రముఖులు



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దుర్గమ్మను శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తమిళ నాడు శ్రీరంగం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ రాఘవన్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఇంద్రకీలాద్రికి విచ్చేసిన శ్రీరంగం ప్రధాన అర్చకులు శ్రీనివాసన్ దంపతులకు దేవస్థానం అధికారులు పండితులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధా కృష్ణ (గాంధీ), అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు. అదేవిధంగా బ్యాడ్మింటన్ ఛాంపియన్ పివి సింధు కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మను దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రికి విచ్చేసిన సింధుకు ఆలయ కార్యనిర్వాహణాధికారి శీనా నాయక్, ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి ఆలయ అధికారులు శేష వస్త్రం, చిత్రపటంతో పాటు ప్రసాదాలు బహుకరించారు .

హెలి జాయ్ రైడ్ పొడిగింపు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ దసరా ఉత్సవాలు, విజయ వాడ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న హెలి రైడ్ కార్యక్రమాన్ని మూడు రోజులు పాటు పొడిగిస్తున్నట్లు విహంగ్ అడ్వెంచర్స్ కెప్టెన్ సూర్య వెల్లడించారు. విహంగ్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెలి జాయ్ రైడ్స్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏవియేషన్ నిర్వాహకులు, కెప్టెన్ సూర్య మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న హెలి జాయ్ రైడ్స్‌ను నగర ప్రజలు ఎంతగానో ఆదరించారని తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు హెలి టూరిజంను మన రాష్ట్రంలో ప్రమోట్ చేయాలన్న ధఢసంకల్పంతో ఉన్నారన్నారు. అందులో భాగంగానే విజయవాడ దసరా ఉత్సవాలలో హెలి జాయ్ రైడ్స్ ప్రారంభించామని తెలిపారు. ప్రజలు ఎంతగానో ఆదరించారని, అందుకే మూడు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని పొడిగిస్తున్నట్లు చెప్పారు.

జిఎస్‌టి 2.0పై ప్రజలకు అవగాహన



ప్రజాశక్తి-విజయవాడ : జిఎస్టీ 2.0పై వియంసి కమిషనర్ ప్రజల్లో అవగాహన కల్పించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఆచార్య రంగా నగర్ ప్రాంతంలో పర్యటించి జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమంలో పాల్గొని అక్కడున్న ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, భగత్ సింగ్ నగర్ రోడ్డు, జిఎస్ రాజు రోడ్డు, అజిత్ సింగ్ నగర్ ఫ్లైఓవర్, డాబాకోట్లు సెంటర్, మాకినేని బసవపున్నయ్య స్టేడియం ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 15 వేల రూపాయల వరకు ఆదా చేసే అవకాశం ఉందని, వ్యాపారులకు అమ్మకాలు పెరుగుదల ఉంటుందని, దేశ వ్యాప్తంగా తక్కువ జీఎస్టీ రేట్లు వర్తిస్తాయని రోజువారి ఉపయోగించే చాలా వస్తువులపై జీఎస్టీ 0 శాతం ఐదు శాతం, ప్రధానంగా రెండు పన్నుల స్లాబ్లు మాత్రమే ఉన్నాయి అని తెలిపారు.

ఇండియన్ ఆయిల్ డైరెక్టర్‌గా శ్రీవాస్తవ బాధ్యతలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇండియన్ ఆయిల్‌లో డైరెక్టర్ (మార్కెటింగ్)గా సౌమిత్ర పి శ్రీవాస్తవ బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ ఆయిల్లో మూడు దశాబ్దాలకుపైగా అనుభవం ఉంది. ఐఐటి రూర్కీ నుంచి సివిల్ ఇంజినీరింగ్ పట్టభద్రులు. ముంబైలోని ఎస్‌పి జైన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఎంబిఎ పట్టా పొందారు. ఎల్‌పిజీ వ్యాపార విభాగంలో నాలుగేళ్లు పని చేసిన తర్వాత సేల్స్ విభాగంలో పలు కీలక పదవులు నిర్వహించారు.

సమిష్టి కృషితో 'విజయ నర్తనం' విజయవంతం



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద మరో అపురూప ఘట్టం గురువారం చోటు చేసుకుంది. దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకొని ఏర్పాటు చేసిన విజయ నర్తనం కొండపల్లి ఉత్సవ్ సమిష్టి కషితో విజయవంతమైంది. దసరా సందర్భంగా విజయ నర్తనం కొండపల్లి ఉత్సవాల్లో భాగంగా పది రోజులపాటు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు కొండపల్లి మునిసిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ఆధ్వర్యంలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కొండపల్లి ఉత్సవ్ విజయవంతానికి శక్తి వంచన లేకుండా కొండపల్లి మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు పని చేశారు.

వైభవోపేతంగా పవిత్ర సంగమం వద్ద తెప్పోత్సవం

కష్ణమ్మ ఒడిలో దుర్గమ్మ జల విహారం కార్యక్రమానికి వీక్షించేందుకు భారీగా జన సందోహం విచ్చేశారు. విజయవాడ తెప్పోత్సవం రద్దవ్వటంతో పవిత్ర సంగమం వద్ద తెప్పోత్సవానికి ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సందర్భంగా సంగమం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారికి నిత్య పూజలు నిర్వహించారు. విజయ దశమి రోజున హంస వాహనంపై కష్ణా నది లో అమ్మవారి తెప్పోత్సవం అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా దుర్గమ్మ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దసరా ఉత్సవాల సందర్భంగా చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారు గురువారం శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అదే రోజు సాయంత్రం పురవీధుల్లో అమ్మవారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తజనులు కోలాటాలు, నృత్యాలు చేశారు. జమ్మి కొట్టే కార్యక్రమం అద్భుతం వైభవంగా జరిగింది. శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్ళశ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ తమ దేవస్థానంలో దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఈ నెల 4న మధ్యాహ్నం దేవస్థానం ప్రాంగణంలో అన్నసంతర్పణ జరుగుతుందని చెప్పారు.

అమెజాన్ ఫ్రెష్ సేవలు విస్తరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రస్తుతం జరుగుతున్న అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సందర్భంగా 270కి పైగా పట్టణాలకు అమెజాన్ ఫ్రెషన్‌ను విస్తరింపజేస్తున్నట్లు అమెజాన్ ఇండియా నిర్వాహకులు కె.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తాజా పండ్లు, కూరగాయలు, పప్పు దినుసులు, గృహావసర వస్తువులు, దైనందిన అవసరాలకు కావలసిన వస్తువులను కస్టమర్లకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సందర్భంగా కస్టమర్లు, కేవలం రూ.1తో ప్రారంభమయ్యే డీల్స్, పండుగ ఆఫర్లను పొంది, తమ పండుగ గ్రోసరీ షాపింగుపై గరిష్టంగా రూ.400ల క్యాష్ బ్యాక్ తో అదనపు సొమ్మును ఆదా చేసుకోవచ్చని తెలిపారు.

ఇన్‌స్టాలేషన్, డెమో సర్వీస్‌ను ప్రారంభించిన శామ్‌సంగ్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ వినియోగదారులకు సజావుగా, ఆందోళన లేని పండుగ షాపింగ్ అనుభవాన్ని అందించడానికి రూపొందించబడిన తన నాలుగు గంటల సూపర్ ఫాస్ట్ ఇన్‌స్టాలేషన్, డెమో సర్వీస్‌ను ప్రారంభించినట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ సునీల్ కుట్టి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు అభ్యర్థనను నమోదు చేసిన నాలుగు గంటల్లోపు తమ సరికొత్త శామ్‌సంగ్ ఉత్పత్తులను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చని తెలిపారు. సూపర్ ఫాస్ట్ ఇన్‌స్టాలేషన్, డెమో సర్వీస్‌తో కస్టమర్ల సమయం, సౌలభ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానం పథకానికి పల్నాడు జిల్లా వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మేళం సాంబశివరావు అనంతలక్ష్మీ దంపతులు రూ.25,116లు విరాళంగా అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలకు ఆలయ సిబ్బంది శ్రీ స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.